నమస్తే తెలంగాణ
# సంగారెడ్డి
I | హైదరాబాద్, ఆదివారం 30 జూన్ 2024 | SANGAREDDY



సంగారెడ్డి జిల్లా కంది గ్రామ శివారులో బోర్ల కింద నాట్లు వేస్తున్న మహిళా కూలీలు



శనివారం హైదరాబాద్‌లో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, మాజీ పీసీసీ చీఫ్ ధర్మపురి శ్రీనివాస్ భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు

## నాట్ల కోలాహలం

సంగారెడ్డి జిల్లాలో వానకాలం సాగు పనులు కొనసాగుతున్నాయి. అడపాదడపా వర్షాలు కురుస్తుండడంతో ప్రస్తుతం సాగు పనుల్లో రైతులు నిమగ్నమయ్యారు. శనివారం సంగారెడ్డి జిల్లా కంది శివారులో బోరుబావి ఆధారంగా పండించేందుకు పొలంలో మహిళా కూలీలు వరినాట్లు వేస్తుండగా 'నమస్తే తెలంగాణ' తన కెమెరాలో చిత్రాలను బంధించింది.

–సంగారెడ్డి ఫొటోగ్రాఫర్, జూన్ 29









సంగారెడ్డి జిల్లా కంది శివారులో నారు మోస్తున్న మహిళలు, పోస్తున్న బోరు

## కొందరికే గృహజ్యోతి..!

### అర్హులకు అందని పథకం..రేషన్‌కార్డు లేనివారికి కట్

- ఆన్‌లైన్ నమోదులో దొర్లిన తప్పులు
- తప్పుల సవరణలకు సెంటర్లకు జనం పరుగులు
- అర్హత ఉండి జీరో బిల్లు రాక వినియోగదారుల అవస్థలు
- ఉమ్మడి మెదక్ జిల్లాలో 4.63 లక్షల మంది లబ్ధిదారులు
- కరెంట్ బిల్లు కట్టాలా..వద్దా అనే ఊగిసలాటలో జనం?

+సిద్దిపేట, జూన్ 29(నమస్తే తెలంగాణ ప్రతినిధి): కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన గృహజ్యోతి పథకం అందరికీ అమలు కావడం లేదు. ఈ పథకంలో 200 యూనిట్లలోపు విద్యుత్ వాడే వారికి ఉచిత కరెంట్ ఇస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం అసెంబ్లీ ఎన్నికల్లో హామీ ఇచ్చింది. కానీ, ఆచరణలో ఇది పూర్తిగా అమలు కావడం లేదు. రేషన్ కార్డు లేదని, సర్వీస్ నెంబర్ తప్పు ఎంటర్ చేయ డం తదితర కారణాలతో చాలామంది జీరో విద్యుత్ అమలు కావడం లేదు. ఒకనెల జీరో బిల్లు విద్యుత్ అందితే..మళ్లీ నెల అదే మీటరు మీద (200 మీటర్లలోపు ) వాడిన కరెంట్ బిల్లు వస్తున్నదని వినియోగదారులు మొత్తుకుంటున్నారు. నిబంధనల ప్రకారం అర్హులందరికీ జీరోబిల్లు ఇవ్వాలి. కానీ, అలా జరగడం లేదు. ఈ విషయంపై విద్యుత్ అధికారులను ప్రశ్నిస్తే టెక్నికల్ సమస్య అంటూ తప్పించుకుంటున్నారు. ఈ సారైనా మాకు జీరో బిల్లు వస్తుందా..? అని ఆశగా ప్రతినెలా వినియోగదారులు ఎదురు చూస్తున్నారు. అధికారులు, స్థానికంగా ఎన్‌రోల్ చేసిన సిబ్బంది ఇద్దరి మధ్యన సమన్వయ లోపంతో వినియోగ దారులకు తిప్పలు తప్పడం లేదు. ప్రతినెలా జిరాక్స్ కాపీలు తీసుకొని ఎంపీడీవో కార్యాలయాల వద్ద ఏర్పాటు చేసిన సెంటర్ల వద్దకు జనం తిరగాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం కారణంగా చాలామందికి జీరోబిల్లు అందడం లేదు. ఇటీవల సిద్దిపేట జడ్పీ సర్వసభ్య సమావేశంలో మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు జీరో విద్యుత్ విషయమై అధికారులను ప్రశ్నిస్తే సరైన సమాధానం లేదు. విద్యుత్ అధికారుల లెక్కల ప్రకారం ఉమ్మడి మెదక్ జిల్లాలో సగం శాతం మంది అర్హులకు జీరో విద్యుత్ అందడం లేదని తేలింది. గృహజ్యోతి పథకం అమలు కోసం గ్రామాల్లో విద్యుత్ సిబ్బంది ఇంటింటికీ తిరిగి వినియోగదారుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. కానీ, వీరిలో చాలామందికి పథకం వర్తించడం లేదు.



ఇటీవల హుస్నాబాద్‌లో గృహజ్యోతికి దరఖాస్తు చేసుకుంటున్న మహిళలు

### కేంద్రాలకు పరుగులు

ప్రజాపాలన దరఖాస్తుల వివరాలను ఆన్‌లైన్‌లో తప్పుగా నమోదు చేయడంతో చాలామంది అర్హులు గృహజ్యోతి పథకానికి దూరమయ్యారు. జీరోబిల్లు వర్తించనందున గ్రామాల నుంచి దరఖాస్తుదారులు మండల కేంద్రాలు, పట్టణ కేంద్రాలకు పరుగులు తీస్తున్నారు. తప్పుల సవరణల కోసం కేంద్రాల వద్ద పడిగాపులు కాస్తున్నారు. సిద్దిపేట జిల్లాలో 3,47,260 విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. వీటిలో 1,71,266 కనెక్షన్లు అర్హులుగా గుర్తించారు. మెదక్ జిల్లాలో 2,05,416 విద్యుత్ కనెక్షన్లకు 1,14,027 కనెక్షన్లు, సంగారెడ్డి జిల్లాలో 5,93,030 విద్యుత్ కనెక్షన్లకు 1,78,064 కనెక్షన్లు అర్హులుగా గుర్తించారు. ఇందుకోసం ప్రతినెలా రూ.16 కోట్లు ప్రభుత్వంపై భారం పడుతుందని అధికారుల లెక్కలు వేశారు. ఉచిత విద్యుత్ కోసం గ్రామాల్లో నిర్వహించిన ప్రజాపాలన సభల్లో ప్రజలు దరఖాస్తు చేసుకున్నారు. ఆ దరఖాస్తులను అధికారులు కంప్యూటర్‌లో అప్‌లోడ్ చేశారు. ఇక్కడే అసలు పొరపాట్లు జరిగాయి. కంప్యూటర్ ఆపరేటర్లు అప్‌లోడ్ చేసే సమయంలో చేసిన పొరపాట్లు వినియోగదారులకు జీరో విద్యుత్ అందకుండా పోయింది. అర్హత కలిగి ఉన్నా నేటికీ జీరో విద్యుత్ అందడం లేదు. ప్రజాపాలన దరఖాస్తు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసే సమయంలో రేషన్‌కార్డు లేదని నమోదు చేశారు. మీటర్ నెంబర్లు తప్పులు ఎంటర్ చేయడంతో పాటు అనేక విధాలుగా తప్పులు దొర్లాయి. రేషన్ కార్డు లేని కుటుంబానికి జీరో విద్యుత్ లేదు. ఎన్నో ఎండ్లుగా రేషన్‌కార్డు లేక ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. రేషన్‌కార్డులు ఇస్తే వారందరికీ ఉచిత విద్యుత్ అందేది. కుటుంబాన్ని ప్రామాణికంగా తీసుకుని మీటర్ వారీగా 200యూనిట్లలోపు విద్యుత్ వాడిన వారందరికీ రేషన్ కార్డుతో నిమిత్తం లేకుండా అందించాలని వినియోగదారులు కోరుతున్నారు.

### జీరో బిల్లు రాకుంటే కట్టాల్సిందే..

చాలామందికి జీరోబిల్లులు రావడం లేదు. ఇప్పుడు వారంతా బిల్లు కట్టాల్సిందే. ఒకవేళ నెల బిల్లు పెండింగ్ ఉన్నా తదుపరి వచ్చేనెల వడ్డీతో సహా నమోదవుతుంది. జీరోబిల్లు రాని వారు తప్పనిసరిగా బిల్లు కట్టుకోవడం మంచిది. మూడు నెలలుగా ఎన్నికల కోడ్ కారణంగా గృహజ్యోతి తప్పుల సవరణను నిలిపివేశారు. ఈ సమయంలో బిల్లు కట్టాలా..వద్దా....?అనే సందేహాల మధ్య వినియోగదారులు ఊగిసలాడారు. ఇప్పుడు ఎన్నికల కోడ్ లేదు. తప్పులు సవరించి వచ్చేనెల అయి నా జీరో బిల్లు వచ్చేలా చూడాలని అర్హులు కోరుతున్నారు.

## ధరణి సమస్యలు వేగంగా పరిష్కరించాలి

### వీడియోకాన్ఫరెన్స్‌లో సీసీఎల్ఏ నవీన్ మిట్టల్

మెదక్/సంగారెడ్డి కలెక్టరేట్/ సిద్దిపేట కలెక్టరేట్, జూన్ 29: ధరణి సమస్యలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సీసీఎల్ఏ కమిషనర్ నవీన్ మిట్టల్ కలెక్టర్లను ఆదేశించారు. శనివారం హైదరాబాద్ సీసీఎల్ఏ కార్యాలయం నుంచి శనివారం వీడియోకాన్ఫరెన్స్‌లో కలెక్టరలతో ఆయన మాట్లాడారు. ఇప్పటి వరకు వచ్చిన దరఖాస్తులు, పరిష్కరించిన దరఖాస్తులపై ఆరాతీశారు. ప్రతిరోజు వెయ్యికి తగ్గకుండా దరఖాస్తులు పరిష్కరించాలని ఆదేశించారు. వేగంగా ఆన్‌లైన్ ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. సక్సెషన్, పెండింగ్, మ్యూటేషన్ వంటి దరఖాస్తుల రికార్డులను తనిఖీ చేసి వెంటనే పరిష్కరించాలన్నారు. అలాగే ప్రతి అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ విద్యార్థుల కోసం సమీకృత గురుకుల విద్యాసంస్థ ఏర్పాటుకు అనుకూలంగా 20 ఎకరాల స్థలాన్ని గుర్తించాలన్నారు. ఆధార్ బయోమెట్రిక్ వేలిముద్ర స్వీకరణ సంబంధించి పరికరాల వినియోగ గడువు ముగుస్తున్న నేపథ్యంలో జిల్లాలకు ఎల్ 1 బయోమెట్రిక్ పరికరాలు పంపించామని, వీటిని సరిగ్గా రీప్లేస్ చేయాలని ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్, అదనపు కలెక్టర్ వేంకటేశ్వర్లు, మెదక్ ఆర్డీవో రమాదేవి, తూప్రాన్ ఆర్డీవో జయ చంద్రారెడ్డి, నర్సాపూర్ ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి, తహసీల్దార్లు పాల్గొన్నారు.వీడియో కాన్ఫరెన్స్‌లో సంగారెడ్డి జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి, అదనపు కలెక్టర్ మాధురి, డీఆర్వో పద్మజారాణి, ఏవో పరమేశ్ తదితరులు పాల్గొన్నారు. సిద్దిపేట కలెక్టర్ మనుచౌదరి. జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, సిద్దిపేట గజ్వేల్,హుస్నాబాద్ ఆర్డీవోలు సదానందం, బన్సీలాల్, రామ్మూర్తి, తహసీల్దార్లు, జిల్లా ధరణి కో ఆర్డినేటర్ వీసీలో పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్

## నీటి సరఫరాలో ఇబ్బందులు తలెత్తొద్దు



సంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ చంద్రశేఖర్‌తో సమావేశమైన ఎమ్మెల్యే చింతా ప్రభాకర్

- సాలీడ్ వేస్ట్ మేనేజెమెంట్ పార్కుకు సహకారం అందిస్తా
- కొత్త మాస్టర్ ప్లాన్ అమలు చేయాలి
- సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్

సంగారెడ్డి కలెక్టరేట్, జూన్ 29: జిల్లాకేంద్రం సంగారెడ్డిలో నీటి సరఫరాలో ఇబ్బందులు తలెత్తకుండా మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ కోరారు. శనివారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్‌తో ఎమ్మెల్యే సమావేశమై నియోజకవర్గ పరిధిలో నెలకొన్న సమస్యలు, పలు అభివృద్ధి పనులపై చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..తాగునీటి సరఫరాలో ఇబ్బందులు లేకుండా చూడాలని, అనుమతి లేని నీటి కనెక్షన్లపై చర్యలు తీసుకోవాలన్నారు. కాలనీల్లో మౌలిక వసతులు కల్పించాలని, వర్షాకాలం దృష్ట్యా కాలనీలు ముంపునకు గురికాకుండా చర్యలు చేపట్టాలన్నారు. సైంటిఫిక్ సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ పార్కు పూర్తి కావడానికి తన వంతు సహకారం అందిస్తానని తెలిపారు. పాత మాస్టర్ ప్లాన్‌లో ఇండస్ట్రియల్ జోన్లు ఉండడంతో ఇల్లు కట్టుకునేందుకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, కొత్త మాస్టర్ ప్లాన్ కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాలని కోరారు. కొత్త భవనాలు నిర్మించిన వారికి అసెస్‌మెంట్ చేసి రెగ్యులర్ చేయాలన్నారు. వెజ్–నాన్‌వెజ్ మార్కెట్ యార్డును పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. సదాశివపేటలో డంపింగ్ యార్డు కోసం స్థలం కేటాయించాలని, తారా ప్రభుత్వ కళాశాల, ప్రభుత్వ దవాఖాన, సితార థియేటర్ వద్ద శిథిలావస్థలో ఉన్న నీటి ట్యాంకులను తొలిగించి కొత్తవి నిర్మించాలని అదనపు కలెక్టర్‌ను ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ కోరారు. సమావేశంలో అధికారులు పాల్గొన్నారు.

## మొక్కలు సిద్ధం.. నాటుడు ఎప్పుడో..!

- ఇంకా ప్రారంభం కాని పనులు
- వరంగల్‌లో 'వన మహోత్సవం' ప్రారంభించిన సీఎం
- హరితహారంతో సంగారెడ్డి జిల్లాలో 6.45 శాతం పెరిగిన పచ్చదనం



సంగారెడ్డి జిల్లా కొండాపూర్ మండలం మల్కాపూర్‌లో సిద్ధంగా మొక్కలు

సంగారెడ్డి, జూన్ 29(నమస్తే తెలంగాణ) : పచ్చదనం పెంచడానికి బీఆర్ఎస్ సర్కార్ హరితహారం కార్యక్రమానికి అత్యంత ప్రాధాన్యం ఇచ్చింది. అటవీ విస్తీర్ణం పెంచేందుకు పదేండ్లలో ఎంతో కృషిచేసింది. బీఆర్ఎస్ పాలనకు ముందు సంగారెడ్డి జిల్లాలో అటవీ విస్తీర్ణం 4.13 శాతం ఉండేది. కేసీఆర్ సర్కార్ హరితహారం ద్వారా సంగారెడ్డి జిల్లాలో తొమ్మిదేండ్లలో 944.65 లక్షల మొక్కలు నాటింది. మొక్కల పెంపకం ద్వారా జిల్లాలో అడవుల విస్తీర్ణం 6.45 శాతం పెరిగింది. పర్యావరణానికి, ప్రజలు మేలుచేసే హరితహారం కార్యక్రమాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాధాన్యత ఇవ్వడం లేదు. వానకాలం ప్రారంభమై నెలరోజుల తర్వాత తీరిగ్గా మొక్కలు నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. శనివారం వరంగల్‌లో సీఎం రేవంత్‌రెడ్డి వన మహోత్సవాన్ని ప్రారంభించారు. బీఆర్ఎస్ సర్కారు అమలుచేసిన హరితహారం పేరును ప్రస్తుత కాంగ్రెస్ సర్కారు వన మహోత్సవంగా మార్చింది. కాగా, విద్యుత్ తీగలకు అడ్డువస్తున్నాయని కొద్దిరోజులుగా విద్యుత్ సిబ్బంది ఇష్టారాజ్యంగా హరితహారం మొక్కలను నరికివేస్తున్నారు. కొమ్మలను నరికివేయాలి కానీ ఏకంగా చెట్లను నరికివేస్తూ పర్యావరణ పరిరక్షణకు తూట్లు పొడుస్తున్నారు. విద్యుత్ శాఖ తీరుపై ప్రజలు, ప్రకృతిప్రేమికులు, పర్యావరణవేత్తలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. కేసీఆర్ ప్రభుత్వం హరితహారం ద్వారా మొక్కల పెంపకానికి పెద్దపీట వేసింది. ప్రభుత్వశాఖల వారీగా లక్ష్యాలను నిర్దేశించి మొక్కలు నాటించి సంరక్షించింది. అటవీప్రాంతాలు, రైతుల భూముల్లో మొక్కలు నాటేలా చర్యలు తీసుకుంది. ప్రతి గ్రామ పంచాయతీల్లో ఒక నర్సరీ ఏర్పాటు చేసింది. ప్రజలు తమ ఇండ్లవద్ద, పెరడులో పూలు, పండ్ల మొక్కలు పెంచుకునేలా ప్రోత్సహించింది. 2015లో సంగారెడ్డి జిల్లాలో హరితహారం ద్వారా మొక్కలు నాటే కార్యక్రమం ప్రారంభమై 2023 వరకు దిగ్విజయంగా కొనసాగింది. తొమ్మిండ్లలో 10.72 కోట్ల మొక్కలు పెంచాలని లక్ష్యంగా పెట్టుకోగా.. 9.44 కోట్ల మొక్కలను జిల్లావ్యాప్తంగా నాటారు. నాటి ప్రతి మొక్క పెరిగేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. దీంతో జిల్లాలో గ్రీన్‌కవర్ గణనీయంగా పెరిగింది. కేసీఆర్ సర్కార్ 2024 వానకాలంలో మొక్కలు నాటేందుకు గ్రామాల్లోని అన్ని ప్రభుత్వ నర్సరీల్లోనూ మొక్కలు సిద్ధం చేసి ఉంచింది. వర్షాలు కురవడం ప్రారంభం కాగానే మొక్కలు నాటేందుకు అంతా సిద్ధం చేసింది. అంతలోనే అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం దీనికి ప్రాధాన్యత ఇవ్వలేదు. సంగారెడ్డి జిల్లాలో 2024–25లో జిల్లాలోని పంచాయతీలు, మున్సిపాలిటీల్లో 28.59 లక్షల మొక్కలు నాటాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇందుకోసం జిల్లాలోని 647 నర్సరీల్లో 38 లక్షలకు పైగా 20 రకాల మొక్కలు సిద్ధంగా ఉంచారు. ప్రస్తుతం జిల్లాలో వర్షాలు కురుస్తున్నాయి. మొక్కలు నాటేందుకు అనువైన వాతావరణం ఉంది. అయినప్పటికీ యంత్రాంగంలో పెద్దగా కదలిక లేదు.



సంగారెడ్డి జిల్లాకేంద్రంలోని అటవీ ఆఫీస్ ఆవరణలో నాటేందుకు సిద్ధంగా మొక్కలు



ములుగులోని ఆయిల్‌పామ్ నర్సరీని పరిశీలిస్తున్న సిద్దిపేట కలెక్టర్ మను చౌదరి

## నాణ్యమైన మొక్కలు అందించాలి

### సిద్దిపేట కలెక్టర్ మను చౌదరి

ములుగు, జూన్ 29: రైతులకు నాణ్యమైన ఆయిల్ పామ్ మొక్కలు అందించాలని సిద్దిపేట కలెక్టర్ మనుచౌదరి అధికారులను ఆదేశించారు. శనివారం సిద్దిపేట జిల్లా ములుగులోని ఆయిల్‌పామ్ నర్సరీని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ...సిద్దిపేట జిల్లాలో మూడు నర్సరీల్లో 8 లక్షల ఆయిల్‌పామ్ మొక్కలను అభివృద్ధి చేశామన్నారు. ఇప్పటికే 11,108 ఎకరాల్లో రైతులు ఆయిల్‌పామ్ మొక్కలు సాగుచేశారన్నారు. ఈ సంవత్సరం మరో నాలుగు వేల మొక్కలు నాటేందుకు నిర్దేశించడం జరగిందన్నారు. రైతులు ఆయిల్‌పామ్‌తో పాటు అంతర పంటలు సాగు చేసి రెట్టింపు ఆదాయం పొందవచ్చన్నారు. ఆయన వెంట జిల్లా ఉద్యానశాఖ అధికారి సువర్ణ, మార్క్‌ఫెడ్ జిల్లా ఇన్‌చార్జి శ్రీకర్, ఉద్యాన శాఖ అధికారులు అనిల్, సౌమ్య ఉన్నారు.







## సేవలు నిల్..

తమ వాహనాలకు పెట్రో, డీజిల్ కొట్టించడానికి పెట్రోల్ బంకుల్లోకి వచ్చే వాహనదారులు పలు సేవలు ఉచితంగా వినియోగించుకోవచ్చు. వాటిలో తాగునీరు, మూత్రశాలలు, మరుగుదొడ్లు, ప్రమాదాలు జరిగితే ప్రథమ చికిత్స కిట్‌ను ఉచితంగా వినియోగించుకోవచ్చు. అంతేకాకుండా తమ వాహనాల టైర్లకు ఉచితంగా గాలి కొట్టించుకోవచ్చు. ఇవన్నీ సౌకర్యాలను పెట్రోల్ బంకుల్లో యజమానులు అందుబాటులో ఉంచి సేవలందించాలి. కానీ, సిద్దిపేట పట్టణంతో పాటు శివారులోని చాలా పెట్రోల్‌బంకుల్లో ఇలాంటి సేవలు సరిగ్గా అందడం లేదనే విమర్శలు ఉన్నాయి. చాలా పెట్రోల్ బంకుల్లో ఏర్పాటు చేసిన ఎయిర్ పంపులు పనిచేయడం లేదు. దీంతో వాహనదారులు తమ వాహనాల టైర్లకు గాలి కొట్టించుకోవడానికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

– నమస్తే తెలంగాణ, స్టాఫ్ ఫొటోగ్రాఫర్, సిద్దిపేట, జూన్ 29

